# పెదాలు నవ్వాయి - గుండె కన్నీరుకార్చింది

---

లాయర్ 5-1-90

రాజకీయ నాయకుల పూలదండలకు పెట్టే ఖర్చు రోడ్డు రిపేరు మీద పెడితే ఇన్ని రోడ్ యాక్సిడెంట్స్ వుండవు.

—జయప్రద

---

ఆది నెల్లూరు నగరం....మాది రామ్మూర్తి నగరం. అర్ధరాత్రి అందరూ గాఢ షుషుప్తిలో మునిగిపోయుండగా బహుశా నేను అంత గాఢనిద్రలో లేనేమో! గ్లాసు కిటికీల బయట వినీ వినిపించని శబ్దానికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. వర్షంలా వుంది. బయట చెట్లు వూగుతున్న కమనీయమైన దృశ్యం తలుపు తీశాను. పెద్ద జల్లు నా మీదుగా

వెళ్ళే మా రూమ్ నేల బాగా తడిపేసింది. వెనక్కి తిరిగి చూశాను మావారు లేవారేమోనని.

ఉహుఁ లేవలేదు. బయటకు అడుగు పెట్టాను. చల్లటిగాలి వేగంగా వచ్చి నన్ను చుట్టుముట్టాయి. ఏమానందం! ఎంత పరవశం! చెప్తే పిచ్చిదంటారు. అందుకే చెప్పను- 'గాలి వాన'ను చూస్తే భయపడాలి గానీ, ఈ గంతులేమిటి చిన్నపిల్లలా అంటారీయన.

వరండాలో తిరిగ్గా ప్రేముకుర్చీలో కూర్చున్నాను. కళ్ళు చికిలించి, బొగ్గులపొడి పరుచుకున్నట్లు చీకటిని చీల్చుకుంటూ వర్షపు ధారలవెంట నా చూపుల్ని సారిస్తున్నాను. వేగంగా ప్రతిధ్వనిస్తున్న గాలుల్ని ఆనందంగా వింటున్నాను.

అలా ఎంతసేపు కూర్చున్నానో తెలీదు. ఒక లారీ మా ఇంటి ముందుగా వురుముతూ వెళ్ళింది. ఎక్కడయినా లారీలు వురుముతాయా? మేఘాలు ఉరుముతాయిగానీ అని ఆశ్చర్య పోకండి. మా ఇంటిముందు ఈ మధ్యనే హైవే చేసిన రోడ్డు తాలూకు గతుకుల్లో పడ్డ లారీలు పాపం ఉరమ కేంచేస్తాయి.

మా ఇంటిముందు కొచ్చేసరికి ప్రతి ఒక్క డ్రయివరూ గేరు మార్చాల్సిందే-ఆ బండి కుక్కలా కుయ్యమని అరవాల్సిందే-కానీ ఈ రోజు చిత్రమేమంటే లారీ బర్ బర్ మంటోంది. ఏమిటని తొంగిచూశాను. ఏదో ఐరన్ సామాను వేసుకెళుతున్న లారీలా వుంది, పాపం మా ఇంటి ముందు గోతిలో కూరుకుపోయి రానని మొండికేస్తోంది.

బర్ బర్‌లు వినలేక లేచి లోపలికొచ్చి పడుకున్నాను నిద్ర పట్టింది నిద్రలో మంచి కలలు. అందులో గాలివానలు మా యింటి ముందు రోడ్డుమీద కలువ కొలనులు-కళ్ళు తెరిస్తే అన్నీ కరిగి పోతాయని భయపడ్డానేమో.

కళ్ళు తెరిచేసరికి గంట ఎనిమిది. కిటికీలోనుంచి తొంగి చూశాను. మా పిల్లలు గుంటల్లో-ఇంటికో గుంట వుంది తెండి-పడవలేస్తున్నారేమో?

వెధవలకు జలుబు చేస్తుందేమోనని-నేను వర్షంలో తడవచ్చు-నాకు జలుబు చేయవచ్చుగానీ ఆ వెధవలకు జలుబు చేయకూడదు. మాతృ ప్రేమ—

నేనూహించినట్లు పిల్లలు చప్పట్లు కొడుతూ పడవల పోటీల్లో లేరు. ఆ స్థానంలో దయ్యంలాంటి లారీ ఇంచుమించు మా మేడమీద కిటికీ లోకి కొచ్చిన ఇనుప సామాను.

అయ్యో పాపం అనుకుని తలెత్తి చూశాను. సన్నటి వానతుంపర కొద్దిగాలి—వరండాలోకొచ్చి అటూ ఇటూ చూశాను. చాలా లారీలు ఆగి పోయి వున్నాయి.

గుడిసెలు లేపి యింకా రోడ్డు వేయని ఆ పెద్ద మైదానంలో ఒకటి అడ్డంగా. ఒకటి నిలువుగా. ఒకటో దిక్కున, మరొకటో దిక్కున. పిల్లలు ఆడి పారేసిన బొమ్మల్లా కనుల పండువులా....

"ఏమిటిది?" ప్రక్కనున్న శ్రీవారి నడిగాను.

"ఏముందీ లారీలు కూరుకుపోయాయి

"ఇన్ని ఒకేసారిలా?"

"ఇలా" నవ్వారాయన మా ఇంటిముందు లారీవేపు వేలు చూపిస్తూ.

"అయ్యయ్యో నా చేపలు చచ్చిపోయాయేమో!"

"ఊహుఁ లారీ చక్రాల క్రింద సరసాలాడుకుంటూ వుంటాయి" నాతో సరసాలు శ్రీవారికి.

"నిన్న కూడా కూరకు సరిపడా పట్టుకొచ్చాడు. అక్వేరియం వలలో చిక్కి" దిగులు పడ్డాను నేను.

"దిగులు పడొద్దుగానీ రాత్రి పెద్ద వర్షమా" నన్ను దిగులు పడ వద్దని ఆయన దిగులుపడుతూ అడిగారు-ఎవరిగొడవ వారిది పంట కొచ్చిన పొలాలు గుర్తుకొచ్చాయాయనకు.

"మంచి వర్షం ఏమీ కాదులెండి-అసలెలా కూరుకుపోయాయేవి?"

"వెనకొచ్చిన లారీలు వర్షంలో కనపడక గతుకుల్లా దిగబడిన ముందు లారీని చూసి నవ్వుకుని మైదానం వేపు పయనించాయి."

"పయనించీ...."

"పయనించి ఏముందీ బురదలో కూరుకుపోయాయి."

"నయం ఊబిలో కాదు"

"ఇంతకన్నా ఊబి వాళ్ళ కేముంటుంది?"

"పోనీలెండి! గోతులేగానీ ఊబీలు లేవు మన రోడ్లమీద."

"మమ్మీ, మమ్మీ అన్నయ్య పడవలు చేశాడు ఎక్కడ వేయమూ" ఏడేళ్ళ మా సుపుత్రిక మమత పరిగెత్తుకుంటూ వచ్చింది. చేతిలో పది పడవలతో.

నా వైపు చిరునవ్వు విసిరారు శ్రీవారు ఎప్పుడూ పిల్లలతో కలిసి పడవలు చేసి ఆనందించే నన్ను ఎద్దేనాచేయడమన్న మాట.

నేను ఓ రిప్లయి నవ్విచ్చాను.

"బడుద్దాయేడీ! డాడీని రమ్మను ప్రక్కింటి ముందు మడుగులో వేసుకుందాం. రమ్మన్నప్పుడల్లా రమ్మంటే వర్షాలొస్తాయా? వచ్చినప్పుడే వేసుకోవాలి గానీ...."

తాయారమ్మ ఇంటి ముందు తామర కొలనులో వేసుకుందామా మమ్మీ.

తొమ్మిదేళ్ళ నా సుపుత్రుడు రెచ్చిపోయాడు.

"కాత్యాయని యింటిముందు కలువల కొలను కూడా వుందేవిటిరా పిక్నిక్ వేసుకుందాం.

"నిజం మమ్మీ! తాయారమ్మ ఆంటీ యింటి ముందున్న నీళ్ళలో మా వాసు తామరపూలువేశాడు" కాన్వెంట్ పిల్ల చిలక పలుకులు పలుకుతోంది ఇంగ్లీషులో.

"ఈ లారీ వెళ్ళిపోయాక మనింటి ముందు మనం కూడా తామర వేసుకుందాం మమ్మీ" చేతులు కాళ్ళు వూపుకుంటూ కథాకళిచేసింది కూతురు.

"అలాగే తల్లీ! నీ యిష్టం కాదంటానా? మీ నాన్నగార్ని గూర్ఖాని పెట్టమను. మామూలు తామరపూలేం ఖర్మ బంగారువి వేసుకుందాం."

"రజిత పద్మాలు కదూ మమ్మీ!"

"మా నాన్నే నీకెంత తెలుగు భాషా పరిజ్ఞానం వుందిరా చెల్లికి కూడా కాస్త నేర్పరా చిట్టి తండ్రి మేఘం అంటే ఏమిటో తెలియదు పిచ్చితల్లికి.

యస్ మమ్మీ ఐ విల్ డెఫినిట్లీ కోచ్ హర్.

తెలుగులో ఏద్వారా తెలుగు పుత్రా అవునూ ఏమండీ మనమొకటి చేస్తే పోలేదా?

ఈ లారీలు, ఈ శబ్దాలు, ఈ కూరుకుపోవడాలు ఎందుకు చెప్పండి. బావున్న రోడ్డు భాగాన్ని కూడా తవ్వేస్తే జనం పడవల్లో వెళ్ళవచ్చుగదా!

నీకంతా హాస్యమే.

అటు చూడు పాపం.

"ఆ పాపం దిశకు తలెత్తాను."

కళ్ళు నెత్తికెక్కాయా? రోడ్డు చూసి కాదూ డ్రయివ్ చేయాల్సింది బండ్లను గోతుల్లో దింపితే ఆ నష్టం ఎవరు భరించాలి. అని తిథ తారు కాటోలు యజమానులు ఆ వర్షంలో అంత చలికో చమటలు కక్కుతూ జాకీలు, స్పానర్లు క్రౌస్పీ, వీటితో కుస్తీలు పడుతున్నారు చూడముచ్చటగా.

"పాపం చాలా లాస్ పతిదేవుడు అదేపనిగా సానుభూతి చూపిం చేస్తున్నారు. ఎంత రిపేరుంటుందో?" కళ్ళతో అంచనా వేస్తున్నారు-వేసి వేసి అన్నారు.

"రిపేరుకు, యిది కదలని నాలుగు రోజుల లాస్ అంతా కలిపితే వేలలో వుంటుంది."

"నాలుగు రోజులు కదలదా? యిదే నాలుగు రోజులు కదలకపోతే మిగతా లారీలు కూరుకుపోను స్థలమేది పాపం" జోక్ విసిరాను.

వాతావరణం పరవశంగా వుందేమో జోక్ల మీద జోకులు వస్తున్నాయి.

"ఇంకా చాలా మైదానం వుందిలేవోయ్ ఎన్ని లారీలైనా దిగబడొచ్చు, దిగులుపడకు.

ప్రతిసారీ వర్షం వచ్చినప్పుడు గోతుల్లోని నీళ్ళలో చంద్రబింబాన్నిచూసి ఆనందించేదానివి.

"ఆగండాగండి ఇప్పుడు....మున్సిపాలిటీ ఫౌంటెన్స్‌ని కూడా–"

"ఆ ఆఁ ఇపుడు ఆనందించడానికి చాలా సీనులున్నాయి తోచనీ ప్రశ్నేలేదు.

"మంచిదే కానీ ఇక నాలుగు రోజులు మనకు నిద్రే లేదా? ఈ ఉరిపేరు కార్యక్రమం అవిరామంగా సాగాల్సిందేనా?"

"గ్లాసు కిటికీల ఇంట్లో కూర్చొని శబ్దాలకు భయపడుతున్నావు. పాపం వాళ్ళు చూడు ఎన్ని అవస్థలు పడుతున్నారో!" మా శ్రీవారి గుండెకు చిల్లిపడి జాలిరసం కారిపోతోంది.

వెదర్ బాగుంది. మార్కెట్ కెళ్ళి మాంసం తెచ్చుకుందామండీ, గారాలుపోయాను.

## 2

"నేనూ వస్తానమ్మా!"

"నువ్వెందుకురా ఇరుకు" స్కూటర్ మీద సర్దుకుని కూర్చోబోతున్న శ్రీవారు కసిరారు.

"రానివ్వండి పాపం రోడ్డు సౌందర్యం చూస్తాడు మనతోబాటు "

ఈ మధ్య నా భావుకత జబ్బు వాడికి కాస్త అంటుకుంటుంది.

డాడీకి ముందు కూర్చోరా అంటే వినకుండా ఇద్దరిమధ్య సర్దుకుని కూర్చున్నాడు. ఈ అందమైన వాతావరణంలో మమ్మల్నిద్దర్నీ విడదీస్తూ.

మా వాహనం కదిలి ఇంకా నాలుగు గజాలుకూడా నడవలేదు. మా ముందు నాలుగు లారీలు బోనెట్లు బిత్తరచూపులు చూస్తున్నాయి ఎటు వెళ్ళాలా అని.

మున్సిపాలిటీ రోడ్లల్లో వెళ్ళాలంటే అమ్మో? నాలుగు లారీలు నాలుగు దిక్కుల్లో దిగబడి పోయిన భయంకర దృశ్యాన్ని చూస్తున్నారాయె పాపం 'మయూరి' లారీ చక్రాలు వర్తిస్తున్నాయి. ఇంజను పదాలు పాడుతోంది. అంత లావు స్టేజి మీద ఎక్కడే అడుగు వేయాలో తోచ నట్టుగా.

అవునూ మొన్న చూసాను నవాబ్ పేటలో బంగారంలాంటి రోడ్డు పగులగొట్టి మరలా వేస్తున్నారు కదా! ఆ డబ్బుతో ఈ రోడ్డు వేయకూడదూ!

దాన్నెప్పుడో కొందరు పిల్చుంటారు ఇప్పుడు ఫండ్స్ లేవు పైగా బైపాస్ రోడ్డు ఆర్ అండ్ బి ది.

"చేయొచ్చు.... చేయరు."

అండర్ బ్రిడ్జి దాటిన వెంటనే అడ్డంగా మరో లారీ గిరు గీరు మంటోంది. కదలనంటోంది. పాపం మా వెనక లారీలన్నీ అష్టాదశ కష్టాలు అనుభవించి తీరా వస్తే వెనక్కెళ్ళాల్సిందే టౌన్‌లోకి దారిలేదు. ఇటు ఈ లారీ కదిలితే తప్ప.

"లారీలకు కూడా పేర్లుంటాయా మమ్మీ" రెక్కలు విప్పుకుంటున్న చక్రికి కుతూహలం.

"ఆఁ ఈ లైలా....మజ్నూ కోసం వెళుతూ ఈ ప్రేమగోతిలో పడిందిరా" అని కూరగాయలు కూడా తీసుకెళదామండీ గొణిగాను శ్రీవారివైపు తిరిగి.

"అలాగే" వరం ప్రసాదించారు పతిదేవుడు. చేపల మార్కెట్ నుండి బయటకొచ్చాక స్కూటర్ కేదో రిపేరు వచ్చినట్టుంది కదల లేదు.

"కాస్త దిగండి."

"లారీలను చూసి మన వాహనానికి కూడా ముచ్చటేసినట్లుంది దిగరా."

మమ్మల్ని దింపి ఆయన అ నట్టూ ఈ నట్టూ త్రిప్పి చెమటలు తుడుచుకుంటూ లేచి నిలబడ్డారు.

"అప్పుడే చమటలుపడితే ఎలాగండీ! పాపం ఆ లారీల వాళ్ళ నేమనాలి?"

నా జోక్‌ని ఆయన ఆస్వాదించలేదు.

"నేను స్టాండుకెళ్ళి వస్తాను. ఒరే చక్రీ అమ్మను తీసుకుని ఆటోలో వెళ్ళిపోరా."

"నా కూరలు"

"ఇక్కడే కదా తీసుకెళ్ళు."

సరిగమలు తెలియని గాయకుడు పాట పాడినట్టు మా ఆటో వేగంగా వెళుతూ సడన్ బ్రేకులేస్తూ గతుకుల్లో పడేస్తూ మా గుండెల్లో రైళ్ళు పరిగెట్టిస్తూ కూరగాయల మార్కెట్ వీధి కొసకి వచ్చి ఆపేసింది.

అదేమిటయ్యా ఈ మధ్యే రోడ్డు వెడల్పు చేసారుకదా! డ్రైనేజ్ మూని! ఇంకో రూపాయిస్తాలే! లోపలికి పోనీ ఖురదగా వుంది. ఏ కళనున్నాడో మా డ్రైవరుగారు లోపలికి పోనిచ్చాడు బొయ్‌మని; 'చూసి తోలవయ్యా' కూరగాయలు కొంటున్న ఓ భారీ శరీరం నడ్డికి తగిలిన దెబ్బను తడుముకుంటూ లేచి నిల్చుంది. మా డ్రైవర్ ఆమె తిట్లని అంతగా పట్టించుకోలేదు. మరలా వంద మైళ్ళ స్పీడుతో పోటో యాడు.

"ఈ రోడ్డులో రాకపోతేనేం ఈ కార్లు ఆటోలు. అరటిపళ్ళ బుట్టామె కోపంగా అరుస్తోంది.

"లోపలున్న వాళ్ళు అరిగిపోతారా?" మార్కెట్‌లోకి ఆటో రానీకపోతే తేగలబుట్టామె తిడుతుంది.

"చక్రి–మనల్నేమిటి తిడుతోంది."

"అవును మమ్మీ"

వాడు తొంగిచూచి ఏదో అనబోయాడు అప్పుడే వాడికి ఉడుకు రక్తం వచ్చిందిలా!

ఇంకా మీసం మొలవలేదే? చెయ్యిపట్టి లాగి కూలేశాను.

"మనకెందుకొచ్చిన గొడవ."

"ఓయ్ ఓయ్! మనుష్యులు నడవనే స్థలం లేకపోతే నువ్వేమిటయ్యా" బుట్ట అరిచింది.

మా వాడికొక డౌటొచ్చింది.

"మమ్మీ రోడ్డు వుండేది వాహనాలు వెళ్ళడానికి కదా?"

నాకూ అదే సందేహం వచ్చింది కానీ బయట పెట్టలేదు బయట పెడితే వీళ్ళంతా నన్ను తిడతారు.

మా కూరగాయలు అందమైన రోడ్ల కుదుపులకు బుట్టలో నుండి గెంతి ఆటోలో దొర్లుకున్నాయి. మా యిల్లు దగ్గర పడబోతోంది సంచిలో చేపల చలనం ఆగిపోయింది. నా గుండె చలనం కూడా క్షణం ఆగింది. మా ఎదురుగా యాక్సిడెంటు. కాత్యాయిన్ని ఇంటిముందు లోయ లాంటి గుంటలో కలువపూల జోక్స్ వేసుకొన్న స్థలంలో ఓ పసిపిల్ల విగత దేహం. ప్రక్కనే వెల్లకిలా పడున్న వాన్ నేను చూడలేదు. ఆ ప్రక్కన భార్యా భర్తలేమో కొన వూపిరితో-పాపా! పాపా అని అరుస్తూ ఆర్తనాదం చేస్తూ....

ప్రొద్దుటి నుండి ఏడ్వలేక నవ్విన గుండె ఈసారి ఏడ్చేసింది.

## 3

ఈ పేద దేశంలో ప్రాణాలకు విలువలేకుండా పోయింది. ఆర్భాటాలకు కొదువలేదు. కోట్లు ఖర్చుపెట్టి ఎలక్షన్ల వార్తలు క్షణాల మీద అందించను టీవిల రిలేలు అర్జంటుగా ఏర్పరచకపోతే ఆ డబ్బు ఖర్చుపెట్టి రోడ్లకు కనీసం పేచ్ వర్కన్నా చేసుండాల్సింది.

కుర్చీని అంటుకుపోయి నాలుగురోజులపాటు ఎలక్షన్ల రిజల్ట్సు కుతూహలంగా చూసి సెంట్రల్ గవర్నమెంటు పనిని మెచ్చుకున్న నేను ఈ రోజు పశ్చాత్తాపపడుతున్నాను.

"మమ్మీ నువ్వేడుస్తున్నావు" కుదుపుతున్నాడు చక్రి."

ఆనంద బాష్పాలు అని జోక్ వేయలేకపోయాను. నోరు తెరిస్తే కన్నీటికుండ బద్దలయ్యేలా వుంది. "పాపా! పాపా!"

తల్లిదండ్రులు పెదవులు కదులుతున్నాయి. శబ్దం బయటకు రాలేదు.

మాతృ ప్రేమను వంచించి లోయల్లాంటి గుంటలకు బలైపోయిన బిడ్డ నుండి కొనవూపిరిలో నున్న తల్లిదండ్రులను వేరుచేసి హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం జరుగుతోంది. ద్రవించే గుండెలకే కన్నీరుకార్చే శక్తి వుంటే ఈ గుంటలన్నీ అవిరామంగా కార్చే కన్నీటితో నిండి పోయేవే.

"మమ్మీ ఏడవకు మమ్మీ" వాడి గొంతులో కన్నీళ్ళు గరగర లాడాయి.

ఏడ్పు పరిష్కారం కాదు. పైగా ఏడ్వాల్సింది నేనుకాదు తన చేతకాని తనానికి ప్రభుత్వం ఏడ్వాలి ఏడ్చి కళ్ళు తడవాలి. ట్యాంక్ బండ్లమీద శిల్పాలు ప్రతిష్టలు కాదు జరగాల్సింది. ఓ బొమ్మకయిన ఖర్చుతో ఈ గతుకులు పూడ్చివుంటే ఇప్పుడు ఈ చిన్నారి శవాన్ని పూడ్చాల్సిన అవసరం వుండేది కాదు. శవాలుగా మారబోయే రెండు దేహాలు వేన్ ఎక్కాయి.

జీవచ్ఛవాలుగా మారిన మేము ఆటో దిగాము.

❋